క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): భక్తులు, దాతల సహకారంతో ముత్యాలంపాడు సాయిబాబా మందిరాన్ని ఆంధ్ర షిర్డీగా తీర్చిదిద్దామని మందిర గౌరవాధ్యక్షులు పూనూరు గౌతంరెడ్డి అన్నారు. ముత్యాలంపాడు బాబా మందిరంలో మంగళవారం నిత్యాన్నదానానికి దాత ముప్పా ఇంద్రకీల గిరీష్, వీరవెంకట శ్రావ్య రూ.లక్ష విరాళాన్ని గౌతంరెడ్డికి అందజేశారు. అనంతరం దాతలకు బాబా శేషవస్త్రాన్ని, చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, ముప్పా శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం, భవానీపురం ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్కిల్–1 పరిధిలోని 41వ డివిజన్‌లో ముస్లిం బరియల్ గ్రౌండ్ చుట్టూ నిర్మించిన ప్రహరీ, 39వ డివిజన్ పరిధిలోని గుప్తా సెంటర్‌లో నిర్మించిన రైతుబజార్ భవనాన్ని, 46వ డివిజన్ కేఎల్‌రావునగర్‌లోగల దోబీఖానాను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉంటేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఏఈ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రామన్ స్ఫూర్తితో పని చేయాలి



ఎమ్మెల్యే మల్లాది విష్ణును సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది



ఎస్ఆర్ఆర్ కళాశాలలో మాట్లాడుతున్న వక్తలు



విద్యార్థుల ప్రదర్శనలు



విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు డాక్టర్ సీవీ రామన్ స్ఫూర్తితో పని చేయాలని అప్పుడే లక్ష్యాలు చేరుకుంటారని పలువురు వక్తలు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన సైన్స్ దినోత్సవం జరిగింది. వక్తలు మాట్లాడుతూ రామన్ చేసిన వైజ్ఞానిక పరిశోధనలు శాస్త్ర సాంకేతిక రంగాన్ని ఎన్నో మార్పులకు గురి చేసిందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, కచ్చితత్వం, నైతిక విలువలు, కష్టపడే తత్వం ఉన్నప్పుడే ఉన్నతస్థాయికి చేరతారని సూచించారు. భౌతిక శాస్త్ర విశ్రాంత అధ్యాపకులు సయ్యద్ పాషా, భాస్కర ప్రసాద్, రాజగోపాలరావు, శ్రీనివాసరావు మాట్లాడారు.

పాఠశాలలు, కాలేజీల్లో ఘనంగా సైన్స్ డే

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో..

మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ గురుకుల మహిళ కళాశాలలో మంగళవారం సైన్స్ దినోత్సవం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ నీరజ సైన్స్‌డే ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తయారు చేసిన పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. సత్యనారాయణపురం బీఆర్‌టీఎస్ రోడ్డు శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజన వెలికితీయటానికి ఇటువంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజారాణి, ఈజీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసేందుకు తాము వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.

అనధికార నిర్మాణం కూల్చివేత

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తే కూల్చేస్తామని వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ జీవీవీఎస్‌వీ ప్రసాద్ మంగళవారం హెచ్చరించారు. సత్యనారాయణపురం శ్రీనగర్ కాలనీలోని 5వ లైనులోని, డోర్ నం 21-10/5-15/2లో జీప్లస్‌త్రీకి మాత్రమే అనుమతి పొంది నిర్మాణం మొదలుపెట్టారని తెలిపారు. ప్లాన్ కంటే అదనంగా మరో ఫ్లోర్ నిర్మిస్తుండటంతో వీఎంసీకి ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. వీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ పర్యవేక్షణలో, స్థానిక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సారథ్యంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, అక్రమ నిర్మూలన దళంతో అదనపు అంతస్తు కూల్చివేశామని తెలిపారు. కొంత మంది బిల్డర్లు మార్టిగేజ్ విడుదల కాకుండానే భవనాల్లో ప్లాట్ల అమ్మకాలు చేపట్టారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో వీఎంసీ నుంచి మార్టిగేజ్ విడుదలైనట్లు ధ్రువీకరణ ఉంటేనే ప్లాట్ల కొనుగోలు చేయాలని వివరించారు. నగర వాసులు భవన నిర్మాణ పనులకు ప్లాను అనుమతి పొందాలని, బ్యాంకులోన్లు రావాలన్నా ప్లానుకు, భవన నిర్మాణ అనుమతి పొందాలని సూచించారు.



అనధికార ఫ్లోర్‌ను తొలగిస్తున్న వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది

నిబంధనల ఉల్లంఘనులకు జరిమానా

భవానీపురం(విజయవాడపశ్చిమ): వీఎంసీ సర్కిల్–1 కార్యాలయంలో ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టును భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి రామమోహన్ మంగళవారం నిర్వహించారు. సర్కిల్–1 కార్యాలయ పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై వివిధ డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 40 కేసులకు సంబంధించిన వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఆయా కేసుల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తులు, పశువులను రోడ్లపైకి వదిలివేసే వారికి రూ.20,510 జరిమానా విధించారు.

గాడిచర్ల జీవితం యువతకు ఆదర్శం

పటమట(విజయవాడతూర్పు): గ్రంథాలయాలు, వయోజన విద్యాకేంద్రాలు స్థాపించి సమాజాభివృద్ధికి కృషి చేసిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు జీవితం నేటి యువతకు ఆదర్శమని రాష్ట్ర సమాచార, పౌరసంబంధ శాఖ సంయుక్త సంచాలకులు పి. కిరణ్ అన్నారు. ఆంధ్రాతిలక్‌గా పేరొందిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు 63వ వర్ధంతి మంగళవారం సర్వోత్తమ భవన్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ వందేమాతరం, ఆంధ్రోద్యమం తదితర ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని వివరించారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్ కల్కురా ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాహితీవేత్త కొప్పర్తి రాంబాబు, ఏపీ గాంధీ స్మారక నిధి కార్యదర్శి వై. రామచంద్రరావు, శారద కళాసమితి అధ్యక్షులు డొకిపర్తి శంకరరావు, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు, ఏపీ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమాచార శాఖ సంయుక్త సంచాలకుడు కిరణ్

దుర్గగుడిలో మనీ సర్క్యులేషన్ స్కీం కలకలం!

లాటరీ, డ్రాల పేరిట డబ్బు వసూలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో మనీ సర్క్యులేషన్ స్కీమ్‌ల కలకలం రేగింది. దేవస్థానంలో ఎన్ఎంఆర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి కొంత కాలంగా ఆలయంలోని సిబ్బంది, ఎన్ఎంఆర్‌లు, కాంట్రాక్టు సిబ్బందిని ఈ స్కీమ్‌లో సభ్యులుగా చేర్పించాడు. ఒక్కొక్కరి నుంచి వారానికి రూ.30 చొప్పున వసూలు చేస్తూ వందలాది మందిని సభ్యులుగా చేర్పించినట్లు తెలుస్తోంది. తొలి వారం రూ.30 చెల్లిస్తే, రెండో వారం రూ. 60 చెల్లించేలా ఈ స్కీమ్‌ను 30 వారాల పాటు నిర్వహిస్తున్నాడు. వారం వారం లక్కీ డ్రాలో ఒక్కొక్కరికి 20 గ్రాముల వెండి కుంకుమ భరిణ, కుక్కర్ ఇలా అనేక వస్తువులు ఇస్తున్నట్లు, స్కీమ్ చివరి వరకు ఉన్న వారికి భారీ బహుమతుల పేరిట ప్రచారం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం మంగళవారం ఆలయంలో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇటువంటి స్కీమ్ ఏమైనా నిర్వహించారా.. సభ్యులందరికీ డబ్బులు చెల్లించారా, లేదా ఏదైనా ఇబ్బంది ఎదురైందా అనే దిశగా దర్యాప్తు జరుగుతోంది. మరో వైపున ఇటువంటి స్కీమ్‌లను ఆలయంలో నిర్వహించడం పద్ధతి కాదని ఆలయ అధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు.

క్రమం తప్పకుండా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు క్రమం తప్పకుండా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ డైమండ్స్ ఆధ్వర్యాన మణిపాల్ హాస్పిటల్ వారితో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు జరిగాయి. ఆమె మాట్లాడుతూ మహిళల్లో క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స చేయడానికి ఇలాంటి శిబిరాలు ఉపయోగపడతాయన్నారు.

అనంతరం ప్రత్యేక వాహనంలో పరీక్షలు నిర్వహించారు. సుమారు 60 మంది మహిళలకు రూ.4 లక్షలు విలువ చేసే పరీక్షలను ఉచితంగా చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ డైమండ్స్ సభ్యులు, మాచవరం వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత క్యాన్సర్ పరీక్షల్లో ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, క్లబ్ సభ్యులు

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్‌లో తాగునీటి పైప్‌లైన్‌కు మంగళవారం మరమ్మతులు చేశారు. ఇక్కడ కాల్వ పక్కనే పైప్‌లైన్ ఉండటం.. అది లీకవ్వడంతో మురుగునీరు కలుస్తోంది. దీనిపై స్పందించి కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, అలంపూరు విజయ్‌కుమార్, రామిరెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దాసాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం సిందూరం, ఆకు పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కార్యక్రమాలను ఈఓ నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

నృత్య వైభవం.. గిరిజా కల్యాణం..



సిద్ధార్థ కళావేదికపై రమణీయం.. గిరిజా కల్యాణం..

విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం(సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ) నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాలలోని వేదికమీద మంగళవారం నాట్యాచారిణి డాక్టర్ వనజా ఉదయ్ బృందం ప్రదర్శించిన గిరిజా కల్యాణం నృత్య రూపకం శాస్త్రీయ నృత్య వైభవాన్ని చాటింది. సతీ వియోగంతో పరమేశ్వరుడు తపస్సు చేయడం, ఆయనకు సపర్యలు చేయడానికి గిరిజను హిమవంతుడు నియమించడం తదితర అంశాలతో నృత్య రూపకం సాగుతుంది. నృత్య దర్శకత్వం భాగవతుల సేతురామన్, గిరిజా దేవిగా డాక్టర్ వనజా ఉదయ్, పరమశివునిగా డాక్టర్ విజయపాల్, మన్మధునిగా చక్రవర్తి, రతీదేవిగా ఐశ్వర్య నర్తించారు. నట్టువాంగం ఆచార్య భాగవతుల సేతురామన్, గాత్రం కన్నారావు, శారదా రెడ్డి, మృదంగం నాగేశ్వరరావు సహకరించారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సంక్షేమానికి కృషి చేస్తున్న జగనన్న

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టైలర్స్ సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు అన్నారు. మంగళవారం గవర్నర్‌పేట నవరంగ్ థియేటర్ రోడ్డులో విజయవాడ టైలర్స్ మిత్రమండలి కార్యాలయంలో టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కుట్టుమిషన్ సృష్టికర్త విలియస్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టైలర్స్ సంక్షేమానికి అసోసియేషన్ లో కీలక పాత్ర పోషించిన ఆరుముళ్ల రోసిరెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. శేషు మాట్లాడుతూ టైలర్లకు ఏటా రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ లోకేశ్వరరావు, చందు బాబూరావు, మెట్రో టైలర్స్ బాబ్జి, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



టైలర్స్ వేడుకల్లో మాట్లాడుతున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

సంక్షేమంలో సరికొత్త అధ్యాయం



బర్మా కాలనీలో స్థానికురాలు కోలా అన్నపూర్ణ అనే వృద్ధురాలి సమస్య తెలుసుకొని వెంటనే పరిష్కారంగా రేషన్ బియ్యాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సంక్షేమ పథకాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారని పలువురు లబ్ధిదారులు కొనియాడారు. 64వ డివిజన్ 284వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. 285 గడపలకు వెళ్లి ఆయా కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందచేసిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసే బ్రోచర్లను ఎమ్మెల్యే అందచేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కోనా అన్నపూర్ణ వేలిముద్ర పడటం లేదని రేషన్ బియ్యం ఇవ్వడంలేదని ఎమ్మెల్యే విష్ణు దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి ఆర్ఐ శరత్‌ను 114 రేషన్ షాపు డీలర్‌ను పిలిచి వేలిముద్రలు పడని వారికి ఐరిస్, ఫేస్ ఫొటోతో బియ్యం ఇవ్వాలని చెప్పారు. ఆమెకు ఎమ్మెల్యే స్వయంగా బియ్యం పంపిణీ చేశారు. పి.చరణ్ అనే దివ్యాంగుడు పెన్షన్ ఇవ్వాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేయగా సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లపై ఉందన్నారు. నగర ప్రజలకు జీఓ నెంబరు 60 ఓ వరమని ఎమ్మెల్యే విష్ణు పేర్కొన్నారు. దీని ద్వారా 100 గజాల లోపు ఇళ్ళకు ఉచిత రిజిస్ట్రేషన్లు చేస్తారన్నారు. తిరుమలను టీడీపీ నేత నారా లోకేష్ రాజకీయ క్షేత్రంగా మారుస్తున్నారని ఎమ్మెల్యే విష్ణు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ నందెపు జగదీష్, డీఈ రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరి, వైఎస్సార్ సీపీ డివిజన కోఆర్డినేటర్ ఎస్‌కే ఇస్మాయిల్, అధ్యక్షుడు జిల్లెల శివ, నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, పందిరి వాసు, అనిల్, కొక్కిలిగడ్డ నాని, మేడా రమేష్, ఎ.త్రినాథ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదరికానికి ఆర్థిక సంస్కరణలే కారణం

సదస్సులో వక్తలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశంలో పేదరికానికి ఆర్థిక సంస్కరణలే ప్రధాన కారణమని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం దేశ భక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) ఆధ్వర్యంలో జాతీయ అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు, సంక్షోభాలపై సదస్సు జరిగింది. పీడీఎం సీనియర్ నాయకులు ఎస్. క్రాంతి కుమార్ మాట్లాడుతూ దేశంలో నూతన ఆర్థిక విధానాలు తీసుకువచ్చిన పాలకులు దేశ, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాలు మాత్రమే నెరవేరుస్తున్నారన్నారు. నాడు మొదలుపెట్టిన అసమానతలు నేడు అదాని, అంబానీ లాంటి వారి అపర కుబేరులు కావడానికి, 90 శాతం మంది ప్రజలు పేదరికంలోకి దిగజారడానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశ సంపద దోపిడీకి గురవుతోందన్నారు. సదస్సులో ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షులు నరసింహారెడ్డి, పీడీఎం సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటేష్, విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.